డిఐపిఆర్ఒగా లక్ష్మీనారాయణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -రాజభాహేంద్రవరం రూరల్

తూర్పు గోదావరి జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా కె.లక్ష్మీనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో అమలాపురంలో పనిచేశారు. కలెక్టర్ పి.ప్రశాంతిని స్థానిక క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన 2020 జనవరిలో ఎపిపిఎస్సి ద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో ఉప సమాచార కార్యనిర్వహక ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టారు. జిల్లాల పునర్విభజన సమయంలో అమలాపురానికి జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ప్రస్తుతం ఆయన రాజమహేంద్రవరంకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు జెసి ఎస్.చిన్నరాముడు, డిఆర్ఒ టి.సీతారామమూర్తి, ఇన్‌ఛార్జి సహాయ సంచాలకులు ఎం.లక్ష్మణాచార్యులు, బదలీపై వెళుతున్న డిఐపిఆర్ఒ సిహెచ్.శ్రీనివాస్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సాగుకు విద్యుత్ గండం

వ్యవసాయ కనెక్షన్ల మంజూరులో అధికారుల నిర్లక్ష్యం



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఖరీఫ్ సాగుకు విద్యుత్ గండం అడ్డంకిగా మారింది. వానలు ముఖం చాటేయడంతో రైతులు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. బావులు, బోర్ల ఆధారంగా కొందరు విత్తనాలు వేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఇంకొందరు రైతులు తమకున్న బోర్లు, బావులకు విద్యుత కనెక్షన్ ఇస్తే మోటార్లు పెట్టుకుని.. కొంతమేరకైనా సాగుకు సమాయత్తం కావాలని ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో విద్యుత్ శాఖ అధికారుల తీరు అలాంటి రైతులకు ఇబ్బందిగా మారింది. దరఖాస్తు చేసుకుని నెలలైనా విద్యుత్ కనెక్షన్ ఇంకా రాక ఎదురుచూస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న తరువాత రెండు పంటల కాలం అయ్యిందని, కాని బోర్లు, బావులకు మాత్రం మోటార్లు బిగించుకోలేక పోయామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు ఖర్చు చేసిన వారికి మాత్రం కనెక్షన్లు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. విద్యుత మోటరుకు రూ.40వేల నుంచి రూ.50వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి.

అడ్డుగోడలుగా ప్రభుత్వ నిబంధనలు

వ్యవసాయ పొలంలో బోరు కోసం ఉచిత విద్యుత్ సర్వీసుకు ప్రభుత్వ నిబంధనలు అడ్డుగోడలుగా మారుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 250కి పైగా దరకాస్తులు వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ 52,869 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. 2024-25 సంవత్సరానికి జిల్లాలో 1,700లకుపైగా సర్వీసులను మంజూరు చేశారు. గతంలో సులువుగా విద్యుత్ సర్వీసుకు అనుమతి లభించేది. ప్రస్తుతం పొలాల్లో ఉచిత విద్యుత్ సర్వీసు కావాలంటే సుమారు 15 రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేయాల్సి ఉంది. ఈ పత్రాల కోసం రైతులు వివిధ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. తహశీల్దార్ కార్యాలయం నుంచి ఫామ్-3 ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, విఆర్ఒ అనుమతి పత్రం, ఫొటోలు, వాల్టా చట్టం ఎన్ఒసి సర్టిఫికెట్, బోర్ వెల్స్ ధ్రువీకరణ పత్రం, భూమి ధ్రువపత్రాలు, పట్టాదారు పాసు పుస్తకం వంటివి సమకూర్చుకుని అనంతరం మీ-సేవలో దరఖాస్తు చేసుకోవాలి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, గతంలో సర్వీసు లేదని వ్యక్తిగత పూచీ పత్రం, మూడేళ్లుగా సాగు చేసిన పంట వివరాలు, నీటి పారుదల సౌకర్యానికి సంబంధించిన పత్రం, సర్వీసుకు ప్రభుత్వం మీటరు ఏర్పాటు చేయవచ్చని తెలుపుతూ అనుమతి పత్రాలు అందజేయాలి. అనంతరమే వారికి విద్యుత్ కనెక్షన్ వస్తుంది. ఇవన్నీ వెరిఫై చేయడానికి రెండు నుంచి మూడు నెలలకు పైగా సమయం పడుతుంది. నిబంధనలు సరళతరం చేసి సర్వీసులు త్వరితగతిన అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అదనపు వసూల్లు జరుగుతోంది ఇలా...

రైతులు మీసేవ ద్వారా దరఖాస్తులు చేస్తే త్వరగా మోటర్లు మంజూరు కావడం లేదని విద్యుత్ శాఖ ఉద్యోగులే మీ సేవా కేంద్రాల వద్ద రైతుల పేరుతో దరఖాస్తులు చేస్తున్నారు. మీసేవలో 5హెచ్‌పి మోటారుకు, 10హెచ్‌పి మోటారుకు మండల స్థాయిలో దరఖాస్తులు సీనియారిటీ ప్రకారం పనులు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ఎక్కువ డబ్బులు ఇచ్చిన రైతులు, మీసేవలో విద్యుత్ ఉద్యోగులు ద్వారా దరఖాస్తులు చేసిన వారికి మాత్రమే కనెక్షన్ల ముందుగా ఇస్తున్నారని పలువురు రైతులు అంటున్నారు. అంతే కాక పని అయిన తరువాత రైతు నుంచి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకూ వసూలు చేస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ గద్దెలను కూడా రైతులతోనే నిర్మాణం చేయిస్తున్నారని విమర్శలున్నాయి. విద్యుత్ స్తంభాల తరలింపును రైతులే చేస్తున్నారు. పైసలు ఇవ్వలేని రైతుల పనులకు కనీసం అంచనాలు కూడా ఇవ్వడం లేదు. దీంతో ముడుపులు చెల్లించుకోలేని రైతులు వ్యవసాయ మోటార్లు స్విచ్ ఆన్ చేయడానికి మోక్షం కలగట్లేదు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

పంచాయతీ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని స్పెషల్ ఆఫీసర్, ఆర్ఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. వేమగిరి గట్టులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గ్రామ పంచాయతీ ప్రతిపాదించింది. దీనికి సంబంధించిన పనులను ఆయన మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలకు రూపకల్పన చేయాలన్నారు. రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాల సమయంలో సర్వే తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. మార్జిన్లు ఫిక్స్ చేసుకున్న అనంతరం రహదారులను డ్రెయిన్ టు డ్రెయిన్ నిర్మించాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా ఎక్కడా వర్షపు నీరు నిలిచి పోకుండా డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలన్నారు. కాలువల లెవల్ సరిగా ఉండేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. మురుగు నీరు, వర్షపు నీరు ఎక్కడా నిలిచే పరిస్థితి ఉండకూడదని ఆదేశించారు. అభివృద్ధి పనులకు సంబంధించి క్వాలిటీ పరీక్షలు ఎప్పటికప్పుడు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. పనులు జరిగే సమయంలో వాహనాల రాకపోకలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రజల అవసరాల మేరకు అవసరమైన విద్యుత్తు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, ఇతర సౌకర్యాలను ప్రతిపాదిస్తే, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. శానిటేషన్ విషయంలో రాజీ పడరాదన్నారు. అనంతరం ఆయన కోలమూరులో పర్యటించారు. తాగునీటి పైపులైన్ పనులను పర్యవేక్షించారు. పారిశుధ్యంపై స్థానికులను ఆరా తీశారు. సమస్యను తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. ఆయన వెంట వేమగిరి పంచాయతీ సెక్రటరీ రూప్ చంద్, కోలమూరు పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, ఇతర సిబ్బంది ఉన్నారు.

సమస్యలపై ఆరా తీస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ

విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి- కొవ్వూరు

విద్యాహక్కు చట్టాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠంగా అమలు అమలు చేయాలని, కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలో పుస్తకాల అమ్మకాలను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై భాస్కర్, ఎం.రాజా డిమాండ్ చేశారు. మంగళవారం భాష్యం పాఠశాలలో పుస్తకాల అమ్మకాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకున్నారు. ఈ విషయంపై ఎంఇఒ-2కు ఫిర్యాదు చేశారు. యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని ఎంఇఒ తెలిపారన్నారు. పుస్తకాలు, బ్యాగులు, ఇతర వస్తువులు అమ్మకాలు చేస్తున్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. వాటిని ఒక గదిలో పెట్టి తాళం వేశారని ఎస్ఎఫ్ఐ నాయకులు వెల్లడించారు. పుస్తకాల అమ్మే స్కూల్‌పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జోసెఫ్, సాహితీ, లహరి నందిని, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల అమ్మకాలను అడ్డుకుంటున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ ఎస్.భాస్కర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం తూర్పుగోదావరి జిల్లా మండల ప్రత్యేకాధికారి డి.రామ్‌ప్రసాద్‌వర్మతో కలిసి ఆయన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ ఎఇ జి.నాగచక్రం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. మంగళవారం ఈ పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హౌసింగ్ పురోగతిపై పలు సూచనలు చేశారు. అనంతరం క్షేత్రస్థాయిలో పానుగంటివారిపేట హౌసింగ్ లే-అవుట్‌ను పరిశీలించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహిళల కోసం నిర్వహిస్తున్న కుట్టు శిక్షణా తరగతులను సందర్శించారు. ఆయన వెంట ఎంపిడిఒ భారతి, హౌసింగ్ డిఇ వైవి.రమణారాజు తదితరులున్నారు.

కాగిత రహిత డాక్యుమెంట్ విధానాన్ని ఉపసంహరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో దొడ్డి దారిన అమలు చేయడం కోసమే కాగిత రహిత డాక్యుమెంట్ విధానాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది, వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాగిత రహిత డాక్యుమెంట్ విధానం రద్దు చేయాలని దస్తావేజు లేఖరులు చేస్తున్న ఆందోళన న్యాయమైందన్నారు. వారికి తమ పార్టీ పూర్తి సంఘీభావం ప్రకటిస్తుందన్నారు. గత సార్వత్రిక ఎన్నికల ముందు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ భూయజమానుల పాలిట శాపమని పెద్ద ఎత్తున ప్రచారం చేసిన టిడిపి, అధికారంలోకి వచ్చిన తర్వాత యాక్ట్ రద్దు చేశామని చెప్పి దొడ్డిదారిన కేంద్ర విధానాన్ని అమలుకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే కాగిత రహిత డాక్యుమెంట్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు

నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు ప్రజలకు సూచించారు. ఉండ్రాజవరం పిహెచ్‌సి పరిధిలో మలేరియా మాసోత్సవంలో భాగంగా అవగాహనా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు హాజరై మాట్లాడారు. వర్షాకాలం దృష్ట్యా నీరు నిల్వ ఉండటానికి ఆవకాశమున్న నిరుపయోగ సామగ్రి, వాహనాల టైర్లు, ఇతర కంటైనర్లను తొలగించుకోవాలన్నారు. వారానికి ఒక సారి డ్రైడే పాటించాలని సూచించారు. చలి, వణుకుతో కూడిన జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జున్నూరి శ్రీనివాస్, తణుకు ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యన్నారాయణ, సెక్రటేరియట్ సిహెచ్ఒ టి.పూజశ్రీ, ఎంపిహెచ్ఎ(ఎఫ్), కె.మేరీమణి, విలేజ్ హెల్త్ సెక్రెటరీ జి.భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్త టి.సునీత, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి మీడియాపై తెలుగు మహిళల ఆగ్రహం

'ప్రజాశక్తి- రాజమహేంద్రవరంప్రతినిధి

అమరావతిపైన, మహిళలపై జర్నలిస్టు వివిఆర్.కృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలపై కూటమి మహిళలు కదంతొక్కారు. ఆ వ్యాఖ్యలను ఖండిస్తూ రాజమహేంద్రవరం మహిళ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి సారథ్యంలో ఆజాద్ చౌక్ నుంచి దేవీచౌక్ వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. సాక్షి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేవీచౌక్ సెంటర్‌లో సాక్షి దినపత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకురాళ్లు మాలే విజయలక్ష్మి, కోసూరి చండీప్రియ, తురకల నిర్మల, కప్పల వెలుగు కుమారి, కె.హారిక తదితరులు మాట్లాడారు. వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు కృష్ణంరాజు, కార్యక్రమాన్ని నిర్వహించిన కొమ్మినేని శ్రీనివాసరావు సాక్షి యాజమాన్యంపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కొవ్వూరు : రాష్ట్ర ప్రజల కలల రాజధాని అమరావతిపైన, అక్కడి మహిళల పైన అభ్యంతరమైన ప్రసారాలు చేసిన సాక్షి మీడియాను తక్షణం రద్దు చేయాలని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సాక్షిలో ప్రసారాలను నిరసిస్తూ కూటమి ఆధ్వర్యంలో కొవ్వూరులో ర్యాలీ నిర్వహించారు. మెరక వీధి వాడటం జంక్షన్ నుంచి ర్యాలీగా బస్టాండ్ సెంటర్ విజయ విహార్ వరకు ర్యాలీ సాగింది. సాక్షి డౌన్ డౌన్ అంటూ మహిళలు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అమరావతి రాజధానిపై సాక్షి మీడియా బురదజల్లే ప్రయత్నంలో భాగంగా తప్పుడు ప్రసారాలు చేస్తుందని ఎమ్మెల్యే ఆరోపించారు. అక్కడి మహిళలపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన కష్ణంరాజు కొమ్మినేని శ్రీనివాసరావుపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విజయ విహార్ సెంటర్లో సాక్షి ప్రతులను తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఎంపిపి కాకర్ల నారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణ, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మద్దిపట్ల శివరామకష్ణ, దాయనా రామకృష్ణ, మహిళలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

నిడదవోలు : అమరావతి మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని శ్రీనివాసరావు, జర్నలిస్ట్ కష్ణంరాజు, దీన్ని ప్రసారం చేసిన సాక్షి యాజమాన్యంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ కూటమి మహిళలు, నాయకులు నిడదవోలు పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు తెలుగు మహిళలు మాట్లాడుతూ దీనిపై సమగ్రంగా విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్ పర్సన్ భూపతి ఆదినారాయణ, మూడు మండలాల టిడిపి అధ్యక్షులు, జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

సాక్షి పత్రిక ప్రతులను దహనం చేస్తున్న తెలుగు మహిళలు

ఉచిత అడ్మిషన్లు నూరుశాతం పూర్తి చేయాలి

జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి వాసుదేవరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విద్య హక్కు చట్టం 12(1)సి ప్రకారం ప్రయివేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం ఉచిత సీట్లను నూరు శాతం పూర్తి చేయాలని జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి ఎంఇఒలను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 10లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. మే 29న ఎంపికైన విద్యార్థుల వివరాలను ప్రకటించినప్పటికీ ఇంకా కొన్ని చోట్ల పూర్తి కాలేదన్నారు. ఎంపికైన విద్యార్థులు ఆయా పాఠశాలల్లో అడ్మిషన్ పొందేలా ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలను ఆదేశించాలన్నారు. ఇది చట్ట పరిధిలో అంశం కాబట్టి చట్ట ప్రకారం తగిన అడ్మిషన్ కల్పించాలన్నారు. అడ్మిషన్‌ను నిరాకరిస్తే ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవడమే కాకుండా పాఠశాల గుర్తింపును రద్దు చేస్తామని తెలిపారు. అడ్మిషన్ పొందిన విద్యార్థుల వివరాలు తగు ధ్రువీకరణతో డిఇఒ కార్యాలయంలో ప్రతి రోజూ అందించాలన్నారు. స్ప్రెడ్ షీట్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ఈ ప్రక్రియ మొత్తం 10వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా పూర్తి చేయాలన్నారు. ఒకవేళ ఎవరైనా అడ్మిషన్ పొందటానికి అనాసక్తి చూపితే వారి నుంచి రాత పూర్వకంగా లేఖ తీసుకోవాలన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

ప్రజాశక్తి -కొవ్వూరు

ఎస్‌సి కమిషన్ దృష్టికి వచ్చిన అర్జీలను త్వరగా పిరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్‌సి కమిషన్ చైర్మన్ కెఎస్.జవహర్ ఆదేశించారు. మంగళవారం కొవ్వూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో డివిజన్ పరిధిలోని అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా రానున్న వర్షాకాలంలో వరదల నివారణా చర్యలు, రోడ్డు భద్రత తదితర అంశాలపై తీసుకునే చర్యల గురించి చర్చించారు. కమిషన్‌కు వచ్చే అర్జీలపై శ్రద్ధ తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ రాణిసుష్మిత, డిఎస్‌పి జి.దేవకుమార్, రూరల్ సిఐలు పి.విశ్వం, కె.విజయబాబు, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్.జవహర్

ముగిసిన కిశోర వికాసం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ రాజమహేంద్రవరం పరిధిలో నెల రోజులుగా నిర్వహించిన 'కిశోర వికాసం' కార్యక్రమం మంగళవారంతో ముగిసిందని సిడిపిఒ నరసమ్మ తెలియజేశారు. మే 2 నుంచి జూన్ 10 వరకు 11 క్లాసులు నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా కిశోర బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించామన్నారు. శారీరక మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత, బాల్యవివాహాలు అనర్థాలు, లైంగిక వేధింపులు, నాయకత్వపు లక్షణాలు వంటి వాటిపై ప్రతి మంగళవారం, శుక్రవారం అవగాహనా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ముగింపు సందర్భంగా కిశోర బాలికలతో మాట్లాడించామని తెఇపారు. అలాగే హాజరైన వారి తల్లుల నుంచి అభిప్రాయాలను సేకరించామన్నారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారిని సూపర్‌వైజర్లు బి.వరలక్ష్మి, బేబిరాణి, మోహనలక్ష్మి, నాగవేణి, అంగన్‌వాడీలు, మహిళా పోలీసు, ఎఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం : మండలంలో కిశోర బాలికలకు, వారి తల్లిదండ్రులను నిర్వహిస్తున్న 'కిశోర వికాసం' అవగాహనా సదస్సులు మంగళవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, కిశోర బాలికలు తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాల గురించి వివరించారు. వారికి ఆరోగ్య సూత్రాలతో కూడిన పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోఎంపిడిఒ వివివిఎస్ .రామారావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, కిశోర వికాసం కమిటీ సభ్యులు ఆయా గ్రామాల కార్యదర్శులు, విఆర్ఒలు, జిఎంఎస్‌కెలు, అంగన్‌వాడీలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగింపు సమావేశంలో పాల్గొన్న రాజమండ్రి సిడిపిఒ తదితరులు

కార్టూ'నిజం'



చెరువు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పట్టణంలోని బాలాజీ నగర్‌లోని బియ్యపు గుంట చెరువును ఆక్రమణ దారుల నుంచి కాపాడాలని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షులు మేడవరపు భద్రందొర ఆధ్వర్యంలో నాయకులు ఈ చెరువును మంగళవారం పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కి వినతిపత్రం అందించారు. మున్సిపల్ పరిధిలో ఉన్న చెరువుని ఆక్రమించుకొంటే అధికారులు ఎందుకు స్పందించట్లేదని ప్రశ్నించారు. ఇప్పటివరకు కనీసం హెచ్చరిక బోర్డు కూడా పెట్టకపోవడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. దీనిపై స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, కాంగ్రెస్ నిడదవోలు మండల అధ్యక్షుడు భావనరమేష్, నాయకులు షేక్ నాగుర్, కాకి శివకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలోని యర్నగూడెం పార్డ్ ఇండియా కార్యాలయంలో మంగళవారం సంస్థ వేసవిలో నిర్వహించు ఉచిత కంప్యూటర్ శిక్షణా తరగతుల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పంచాయతీ కార్యదర్శి ఎ.అమ్మిరాజు మాట్లాడుతూ పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ గ్రామాభివృద్ధికి సహకారం అందించడం అభినందనీయమన్నారు 2011 నుంచి విలేజ్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుచేసి ప్రతీ ఏటా వేసవిలో విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నామని సంస్థ గౌరవ అధ్యక్షులు కారుమంచి గణేష్ తెలిపారు పార్డ్ ఇండియా సంస్థ నెలకొల్పి సమాజ హితానికి ఎన్నో సేవలు అందిస్తున్న సంస్థ వ్యవస్థాపకులు బేతాల వీరాస్వామి ఆదర్శప్రాయులని సచివాలయ కార్యదర్శి గారపాటి రవికుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్డ్ ఇండియా సభ్యులు దేవరాజు అచ్యుతరావు ధూళిపూడి రవీంద్ర సోమశెట్టి వెంకటరావు హేమకుమార్ గుదే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

షైనింగ్ స్టార్ విజేతలకు అభినందన

ప్రజాశక్తి - తాళ్లపూడి

విద్యార్థులు మరింత పోటీతత్వంతో చదువు కొనసాగిస్తూ ప్రభుత్వ అవార్డుకు సార్ధకతను తీసుకురావాలని తాళ్లపూడి లోని మాంటిస్సోరీ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ వ్యవస్థాపక కరస్పాండెంట్ వివి.అనీష్ అన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం అందించిన షైనింగ్ స్టార్ అవార్డుకు మండలం నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో ఐదుగురు తమ పాఠశాల విద్యార్థులే కావడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. తాళ్లపూడి పాఠశాల ఆవరణలో మంగళవారం పాఠశాల యాజమాన్యంతో పాటూ ఉపాధ్యాయులు అవార్డు అందుకున్న ఐదుగురు విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులతో కరస్పాండెంట్ అనీష్

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో రూ.50 లక్షలతో నిర్మించిన పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను ప్రముఖ పారిశ్రామికవేత్త ఆంధ్ర షుగర్స్ సిఎండి పెండ్యాల అచ్చిబాబుతో కలిపి ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. హెల్త్ యూనిట్ లోని మరి కొన్ని విభాగాలను మాజీ ఎంఎల్ఎ టివి.రామారావు ప్రారంభించారు. అనంతరం రైతులకు వ్యవసాయ పరికరాలను అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి రుచిత, సర్పంచ్ రాపాక రాజేశ్వరి, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ సుచందన ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమని రామకృష్ణ, సొసైటీ అధ్యక్షులు మద్దిపట్ల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల బదిలీల ప్రక్రియ పూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో పోలీసుల బదిలీలు పూర్తి అయ్యాయని ఎస్పి డి.నరసింహకిశోర్ తెలిపారు. సుమారు 80 మంది ఎఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లను బదిలీ చేసినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఒకే పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు సంవత్సరాలు అంతకన్నా ఎక్కువ సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని బదిలీ చేవామన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఈ బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి(అడ్మిన్) ఎన్‌బిఎం.మురళీకృష్ణ, డిఎస్‌పి(ఎస్‌బి) బి.రామకృష్ణ, ఎస్‌బి సిఐ ఎ.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ పవన్‌కుమార్ రెడ్డి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు మార్తి లక్ష్మి విమర్శించారు. వైసిపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మార్తి లక్ష్మి ఆధ్వర్యాన మంగళవారం గోకవరం బస్టాండ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి, ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల మహిళా అధ్యక్షులు పోలు విజయలక్ష్మి, ఇమంది విజయకుమారి, దాకారపు బంగారమ్మ, ముప్పిడి దమయంతి, అంగాడ సత్యప్రియ, చీరాల ఉమాదేవి, అలాగే ఎస్.భవానిప్రియ తదితరులతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు. మహిళలపై దాడులు అరికట్టాలని, వైఎస్ భారతికి క్షమాపణ చెప్పాలని నినదించారు. ఈ సందర్భంగా మార్తి లక్ష్మి మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు జరుగుతుంటే హోం మంత్రి మహిళ అయివుండి కూడా మాట్లాడక పోవడం దారుణమన్నారు. అత్యాచారాలకు గురైన మహిళల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని ఆమె ప్రశ్నించారు. మహిళలకు న్యాయం చేస్తామని చెప్పిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మహిళల రక్షణ గురించి పట్టించుకోవడంలేదన్నారు.

వైసిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న మహిళలు

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మహిళలపై అత్యాచారాలు చేస్తున్నవారిని అరెస్ట్ చేయాలన్నారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. అలాగే సాక్షి ఛానల్‌లో జరిగిన డిబేట్‌లో ఒక తప్పుమాట దొర్లిందని సాక్షి ఆఫీసుల వద్ద ఆందోళన చేయడం, భారతిని, జగన్‌ని నిందించడం సరికాదన్నారు. భారతికి క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ మహిళలకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను సైతం కూటమి ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. తప్పు జరిగిందని సంబంధిత డిబేట్‌లోని వ్యక్తులు క్షమాపణ చెప్పినప్పటికీ, సంబంధం లేని భారతమ్మను దూషిస్తూ రాద్ధాంతం చేయడంలో ఉద్దేశ్యమేమిటని ఆమె ప్రశ్నించారు. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని ఆమె డిమాండ్ చేసారు.

నేరాలు ఘోరాలు

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

చోరీ కేసుల్లో ఇద్దరు అరెస్ట్

10 లక్షల బంగారు ఆభరణాలు స్వాధీనం

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు రూరల్, సమిశ్రగూడెం, తాళ్లపూడి స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు రూరల్ సిఐ కె.విజయ్‌బాబు తెలిపారు. వీరి నుంచి రెండు కేసులకు సంబంధించి రూ.10లక్షల విలువైన 125 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నెల్లూరు జిల్లా బిట్రగుంటకి చెందిన మారుబోయిన మాల్యాద్రి, పశ్చిమగోదావరి జిల్లా రాయలం గ్రామానికి చెందిన తోటకూర రామకృష్ణంరాజులను అరెస్ట్ చేశామన్నారు. దేవరపల్లి వైపు నుంచి కొవ్వూరు వైపు కారులో వేగంగా వస్తుండడంతో అనుమానంతో విచారించగా నేరాలు బయట పడ్డాయన్నారు. నిందితుల నుంచి చోరీ సొత్తు రికవరీ చేశామన్నారు. కారులో వచ్చిన నరసాపురానికి చెందిన మరో నిందితుడు సద్దుల కుమార్‌రాజా పరారీలో ఉన్నట్లు సిఐ తెలిపారు. అరెస్ట్ చేసిన ఇద్దరు నిందితులను మంగళవారం రిమాండ్‌కు తరలించామన్నారు. రూరల్ ఎస్ఐ కె.శ్రీహరితోపాటు, క్రైమ్ ఎస్ఐ పి.రవీంద్రబాబు ఇతర సిబ్బంది కేసు ఛేధించడంలో కీలక పాత్ర పోషించారని సిఐ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-కాజులూరు

కుటుంబ తగదాల నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఒక వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం గొల్లపాలెంలో సుందరపల్లి శేషారావు (39) జీడి మామిడి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకుని పోలీసులు కుటుంబ సభ్యులు సహకారంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. శేషారావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్ఐ మోహన్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలీని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట రైల్వే స్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ పి.వాసు అందించిన వివరాల ప్రకారం మంగళవారం రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. మతుడు తెలుపు రంగు చొక్కా, నీలం రంగు లుంగీ ధరించి ఉన్నాడు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించగా అతని ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎస్ఐ వాసు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణంలోని సాయిబాబా గుడి వెనుక పేకాట ఆడుతున్న శిబిరం పై పోలీసులు దాడులు నిర్వహించారు ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుండి 1720 నగదు స్వాధీన చేసుకున్నారు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్ ఐ ఎన్ రామకష్ణ తెలిపారు

తప్పిపోయిన బాలుడు సురక్షితం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

తప్పిపోయిన మూడేళ్ల బాలుని గంట వ్యవధిలో కనుగొని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పట్టణంలోని బిసి కాలనీకి చెందిన పప్పిరెడ్డి పాపారావు, కావ్యల కొడుకు రిత్విక్ శ్రీహాన్‌తో మార్కెట్ సెంటర్‌లోని పాపారావు సోదరునిఇంటికి వెళ్లారు. శ్రీహాన్ ఉదయం 11 గంటలకు కనిపించకుండా పోయాడు. వెంటనే పాపారావు దంపతులు గొల్లప్రోలు పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ ఎన్.రామకృష్ణ వెంటనే పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేసి బాలుని ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. జాతీయ రహదారిలోని అపర్ణ హోటల్ వద్ద బాలుని గుర్తించారు. తప్పిపోయిన ఒక గంట వ్యవధిలోనే బాలుని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుని తల్లిదండ్రులు ఎస్ఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

పిల్లలు సహా వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

పిల్లలతో సహా వివాహిత అదృశ్యంపై ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జకినీకి దుర్గాదేవి, ప్రభుకుమార్ భార్యాభర్తలు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆమె తన ఇద్దరు పిల్లలతో కలిసి ధవళేశ్వరం ఎర్రకొండ ప్రాంతంలో నివాసం ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. మే 3న విశాఖలో తన భర్త వద్దకు వెళ న్నానని చెప్పి బయలు దేరింది. కాని ఆమె విశాఖలో ఆమె భర్త వద్దకు చేరలేదు. అప్పటి నుంచి దుర్గాదేవి, ఆమె ఇద్దరు పిల్లలు వెంకట సాయి, పూర్ణ అదృశ్యమయ్యారు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో దుర్గాదేవి తల్లి విజయలక్ష్మి మంగళవారం ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వివరాలు తెలిసిన వారులు 9440796586, 9491999336 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సారా బట్టీపై దాడి

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని కరగపాడు గ్రామంలో సారా బట్టీపై దాడి చేసి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.మనోహర్ మంగళవారం తెలిపారు. ఈ దాడుల్లో ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని, వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. మండలంలో చట్ట వ్యతిరేక పనులు, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తరుణ్ ఇండస్ట్రీలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-తాళ్లపూడి

మండలంలోని అన్నదేవరపేట గ్రామ రెవెన్యూ పరిధిలోగల తరుణ్ ఇండస్ట్రీస్ కంపెనీలో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఒక్కసారిగా మంటలు ఎగిసి పడటంతో అందరూ భయాందోళనకు గురయ్యారు. ఈ గొడౌన్‌లో బేరియం క్లోరైడ్ స్టాక్ ఉంటుందని, దీని వల్ల మంటలు మరింత ఎక్కువైనట్టు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న కొవ్వూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని మండలను అదుపు చేశారు.

దగ్ధమవుతున్న తరుణ్ ఫ్యాక్టరీ

ప్రత్తిపాడులో పట్టపగలు భారీ చోరీ

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో పట్టపగలు భారీ చోరీ చోటు చేసుకుంది. గ్రామంలోని కొత్తపేట వీధి శివారు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న నివాసంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఘటనకు సంబంధించి పోలీసులు వివరాలు ఇలా ఉన్నాయి. కంటిపూడి శివానంద భాస్కర్ రావుకు చెందిన రెండంతస్తుల బిల్డింగులో యజమానులు లేని సమయంలో దుడంగులు చోరీకి పాల్పడ్డారు. సిఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆ కుటుంబ యజమాని వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. చోరీ జరిగిన ఇంటిని మంగళవారం సాయంత్రం పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరి రాజు పరిశీలించారు. ఈ చోరీకి ముగ్గురు దుండగులు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు.

సముద్రంలో ఇద్దరు యువకుల గల్లంతు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఎస్.యానం బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలో దిగి ఇరువురు యువకులు గల్లంతయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..మంగళవారం సాయంత్రం అంబాజీపేట మండలం మాచవరంకు చెందిన యాళ్ళ హరికిషోర్(19), అయినవిల్లి మండలం నేదునూరుకి చెందిన ఇసుకపట్ల జస్వంత్(19) నేదునూరుకు చెందిన మరో ముగ్గురు యువకులు ఎస్.యానం బీచ్‌కు వచ్చి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. వీరిలో యాళ్ల హరికిషోర్, ఇసుకపట్ల జస్వంత్ సముద్రంలో గల్లంతయ్యారు. గల్లంతైన యువకుల కోసం ఎస్ఐ సిహెచ్.రాజేష్, పోలీసు సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా హరికిషోర్ మృతదేహం లభ్యం కాగా, జస్వంత్ కోసం గాలింపు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగిన యువకుడు మృతి

ఉప్పలగుప్తం : పురుగుల మందు తాగిన ఒక యువకుడు మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం..మండలంలోని గొల్లవిల్లి పంచాయితీ వాడపర్రుకు చెందిన కమిడి సురేష్(25) ఈనెల 7న పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు అతనిని అమలాపురంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గోదావరిలో పడి యువకుని మృతి

రామచంద్రపురం : కోటిపల్లి వద్ద గోదావరిలో నపడి యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని తోటపేట గ్రామానికి చెందిన అల్లం రాజేష్ సోమవారం తెల్లవారుజామున కోటిపల్లి సోమేశ్వర స్వామి ఆలయానికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లాడు. మంగళవారం మధ్యాహ్నం వరకు అతను తిరిగి రాకపోవడంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం సాయంత్రం అతని మృతదేహం కోటిపల్లి సుందరపల్లి గోదావరి మధ్యలో లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కె.గంగవరం ఎస్ఐ జానీభాష తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు, ఎంఎల్‌సి సోము వీర్రాజు

నగరాభివృద్ధే ధ్యేయం

సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

నగరాభివృద్ధే తమ ధ్యేయమని, ప్రజా సంక్షేమం తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్థానిక 45వ డివిజన్‌లోని ఎంఎస్ఆర్ లే-అవుట్, అలాగే ఇందిరా నగర్‌లో సుమారు రూ.50లక్షలతో చేపట్టిన సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులకు ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎంఎల్‌సి సోము వీర్రాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశినవీన్‌కుమార్, కాంట్రాక్టర్ కుందుల సతీష్ తదితరులతో కలిసి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఆదిరెడ్డి మాట్లాడారు. నగరంలోని ఏ ప్రాంతానికి వెళ్లినా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజలకు ఏం అవసరమో తెలుసుకుని ఆ మేరకు శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. 45వ డివిజన్‌లో ఎక్కువగా బలహీన వర్గాల వారు నివాసం ఉంటారని, అటువంటి ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడితేనే వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. నగర శివారు ప్రాంతంమైన క్వారీ ఏరియాలోనే ఎక్కువగా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఏడాది కాలంలోనే తాము సుమారు రూ.250 కోట్ల విలువైన పనులు చేపట్టామని వివరించారు. ఈ నెల 12వ తేదీకి కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తి చేసుకోబోతోందన్నారు. ఆ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎంఎల్‌సి సోము వీర్రాజు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రాజమండ్రి సిటీలో అవసరమైన చోట అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రోడ్లు కాలువలు నిర్మిస్తున్నామని చెప్పారు. రాజమండ్రి చరిత్ర భవిష్యత్తులో నిలిచిపోయేలా కూటమి పనులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ పుట్టిన రోజు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

విలక్షణ వ్యక్తిత్వం,సేవాభావం కలిగి ఇటు రాజకీయాలలో అటు సినిమా రంగంలో మకుటం లేని మహారాజుగా నందమూరి బాలకృష్ణ వెలుగొందుతున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నందమూరి వంశాభిమానుల సంఘం గౌరవాధ్యక్షులు గన్ని కృష్ణ అన్నారు. నందమూరి వంశాభిమానుల సంఘం అధ్యక్షుడు గొర్రెల రమణ, బిక్కిన సాంబ ఆధ్వర్యంలో శ్రీరామనగర్‌లో గన్ని నివాసం వద్ద బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం కేక్ కట్ చేసి పంచారు.

అభివృద్ధి పనులకు రూ.5.30 కోట్లు మంజూరు

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లిలో అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ మద్దిపాటి చొరవతో రూ.5.30 కోట్లు మంజూరయ్యాయని టిడిపి మండల మాజీ అధ్యక్షులు సుంకర దుర్గారావు తెలిపారు. దేవరపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామదర్శిని కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎంఎల్ఎ అభ్యర్థి మన మండలం వ్యక్తి కాదు, అసలు మండలంపై దృష్టి పెడతారా లేదా అనే అపోహలు ఉండేవన్నారు. వాటిని ఎంఎల్ఎ మద్దిపాటి పటాపంచలు చేస్తూ భారీగా నిధులను విడుదల చేశారన్నారు. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలు అధికారంలో ఉండి స్థానికంగా దేవరపల్లికి చెందిన వ్యక్తే ఎంఎల్ఎగా ఉన్నా చేసిందేమీ లేదన్నారు. ముఖ్యమంత్రి రిలీఫ్‌ఫండ్ చెక్కుల విషయంలో ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అడిగిన తక్షణం నిధులు మంజూరు చేయించడంతో కష్టాల్లో ఉన్న ఎన్నో కుటుంబాలకు ఆసరా కలుగుతుందన్నారు. తెలుగుదేశం కార్యకర్తను అని కాలరెగరేసుకొని చెప్పేలా ఎంఎల్ఎ వెంకటరాజు పరిపాలన ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సుంకర దుర్గారావు సభ వేదికగా గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజుకూ మంత్రి పదవి ఇవ్వాలని అధిష్టానాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యాగంటి వెంకటేశ్వరావు, కాట్రు భీమరాజు, బళ్ళ సూర్యచక్రం, కొండపల్లి దొరయ్య, లక్ష్మీపతిరాజు పాల్గొన్నారు .

గ్రామదర్శినిలో మాట్లాడుతున్న దుర్గారావు

రత్నం రాజు సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-కడియం

దామిరెడ్డిపల్లికి చెందిన పాస్టర్ దేవరపల్లి రత్నం రాజు సేవలు ఆదర్శనీయమని సర్పంచ్ అన్నందేవుల చంటి కొనియాడారు. రత్నం రాజు తన తండ్రి వర్థంతి సందర్భంగా మండలంలోని మాధవరాయుడు పాలెం పంచాయతీ పరిధి చైతన్య నగర్ ఇమ్మానియేలు కుష్టువ్యాధిగ్రస్తుల సంరక్షణ కేంద్రంలో బాధితులకు మంగళవారం నూతన దుస్తులు, ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి చంటి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో నిర్లక్ష్యానికి గురైన వర్గాలను ఆదుకునేందుకు ఆయన తీసుకుంటున్న బాధ్యత అభినందనీయమన్నారు. త్వరలో తాను కూడా అందరికీ దుస్తులు ఆహారం పంపిణీ చేస్తానని చంటి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెలుగుబంటి నాని, సంస్థ నిర్వాహకులు వై.చార్లెస్‌పాల్, పాస్టర్ విక్టర్ పాల్, ధనుంజయ్, చందూరు సూరిబాబు, యండపల్లి అప్పల పాత్రుడు , పాస్టర్ రత్నం రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


దుస్తులు అందిస్తున్న సర్పంచ్ చంటి, పాస్టర్ రత్నం రాజు

ప్రతిభ అవార్డులు అందుకున్న విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-గోకవరం

ప్రతిభా అవార్డులు అందుకున్న కొత్తపల్లికి చెందిన బాల రాజేష్, గోకవరం గ్రామానికి చెందిన రాజా పబ్లిక్ స్కూల్ విద్యార్థిని జిఎంఎల్.ప్రసన్నని పలువురు అభినందించారు. ఆయా పాఠశాలలు ఉపాధ్యాయులు మాట్లాడుతూ భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్లో పదోతరగతి విద్యనభ్యసించి జిల్లా స్థాయిలో ప్రతిభా అవార్డులను అందుకోవడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు.

70 రోజుల పాటు చలివేంద్రం నిర్వహణ

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు గ్రామంలో 70 రోజుల పాటు చలివేంద్రాన్ని గ్రామ పంచాయతీ సహకారంతో నిర్వహించామని మానవత సేవా సంస్థ అధ్యక్షులు జుజ్జవరపు వెంకటకృష్ణ ప్రసాద్ తెలిపారు. మంగళవారంతో చలివేంద్రాన్ని మూసేశామన్నారు. మార్చి 30న ప్రారంభించిన ఈ చలివేంద్రానికి ఎంతో మంది దాతలు సహకరించారన్నారు. వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

చాగల్లు జడ్‌పిహెచ్‌ఎస్ హెచ్‌ఎంగా వాసవి

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఎస్.వాసవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో బ్రాహ్మణగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేశారు. ప్రమోషన్‌పై చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన మోహన్‌కృష్ణ నిడదవోలు మండలం పెండ్యాల జడ్‌పి ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. చాగల్లు జడ్‌పి హైస్కూల్ చరిత్రలో తొలిసారిగా మహిళా హెచ్‌ఎంగా వాసవి వచ్చారు.

మల్లవరంలో టిబి ముక్త్ భారత్ అభియాన్

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని మల్లవరంలో మంగళవారం ఇంటెన్సిఫైడ్ టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి నిఖిత ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. టిబి పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. టిబి అంతానికి అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. అవకాశం ఉన్నవారు నిక్షయ్ మిత్రగా చేరి టిబి వ్యాధిగ్రస్తులకు పోషకాహారం అందించేలా సహకరించాలని కోరారు. గ్రామాలలో డయాబెటిక్, పొగాకు ఉత్పత్తుల వాడే వారికి, ఇతరత్రా వ్యాధులు ఉన్నవారికి, 60 ఏళ్లు పైబడిన వారికి, గతంలో టిబి మందులు వాడిన వారికి, వారి సమీపస్తులకు కళ్లె పరీక్షలు, ఎక్సరేలు తీసి వ్యాధి నిర్ధారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. దగ్గు, బరువు తగ్గిపోవడం, జ్వరం తగ్గకపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే టిబి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలాన్నారు. ఈ కార్యక్రమంలో 178 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిఎస్.శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పిలు మాలతీ, దినేష్, హెల్త్ అసిస్టెంట్ రమణ, ఎఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

సిడిపిఒగా మమ్మీ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం ఐసిడిఎస్ సిడిపిఒగా డి.మమ్మీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కొవ్వూరు సిడిపిఒగా పనిచేస్తూ బదిలీపై గోపాలపురం వచ్చారు. ఇప్పటి వరకూ గోపాలపురం సిడిపిఒగా పనిచేస్తున్నా నాగలక్ష్మి కొవ్వూరుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు బదిలీపై వచ్చిన సిడిపిఒకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. సిడిపిఒ మమ్మీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను సక్రమంగా అందేలా చూస్తానాన్నరు.

సిడిపిఒకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సూపర్‌వైజర్లు

KAKINADA MUNICIPAL CORPORATION
'e' PROCUREMENT NOTIFICATION

Roc No. 4283/2025/E2, **Dated: 10-06-2025**

Tenders invited through ap e procurement platform for 01 works, Tenders invited through offline tender for 02 works with an estimated amount value of **Rs. 10,33,825/-** from the eligible contractors in the following manner.

One Works for an amount of Rs. 3,33,825/-
Last date and time for downloading bid documents : Dt.16-06-2025 upto 10-00 AM
Last date and time for submission of bids : Dt. 16-06-2025 upto 10-30 AM

OFFLINE TENDER NOTIFICATION
Two Works for an amount of Rs. 7,00,000/-
Last date Tender Schedule payment in Municipal Corporation Treasury : 17-06-2025 upto 4-30 PM
Last date and time for Tender Schedule issue : 17-06-2025 upto 5-00 PM
Last date and time for Tender Schedule receiving : 18-06-2025 upto 4-00 PM

Tender Inviting Authority:
Commissioner, Municipal Corporation, Kakinada
Mail: kkd_mplcorp@yahoo.com
Call Centre Phone: 0884-2357722

Further details can be seen at 'e' procurement market place @ www.apeprocurement.gov.in

Sd/- **BHAWNA,** *I.A.S.,*
Commissioner, Municipal Corporation, Kakinada

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
E.P. No. 16/2020
O.S. No. 53/2009

Between:
M/s. సిటీ చిట్స్ & ఫైనాన్స్, కాకినాడ, Rep. by its Mg. Partner, మార్ని వెంకయ్య చౌదరి ...DHr
AND
యల్లాప్రగడ సుధాకర్, వగైరా ...JDrs

To:
యల్లాప్రగడ సుధాకర్, S/o. వెంకటానందం, పవన్ ఎంటర్‌ప్రైజెస్, HP గ్యాస్ కంపెనీ, సంగీతరావు పేట, సామర్లకోట. ...JDr-1

పై నెంబరు డిక్రీ అమలులో CPC Or 21, R 22 నోటీసుపై 1వ JDr అయిన మీ హాజరు నిమిత్తం వాయిదా **ది. 24-6-2025.** కాబట్టి మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల వాయిదా **తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరయి తెలుపుకోవలెను.

వాయిదా : 24-6-2025

ఓరుగంటి సుధాకర్
కాకినాడ అడ్వకేట్, కాకినాడ
ది.02-6-25 సెల్:9441143021

మహారాజశ్రీ కాకినాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిలు జడ్జి వారి కోర్టులో
O.S. No. 409/1985
E.P. No. 187/2018

Between:
మేడిశెట్టి బాబూరావు ...DHr
AND
1. మట్ట మంగయమ్మ (died)
2. మట్ట వెంకటరమణ (died)
3. మట్ట భాస్కరరావు (died)
4. మట్ట ప్రకాశరావు (died)
5. మట్ట కృష్ణ S/o. సూరన్న
6. బోన మంగాదేవి W/o. గణేష్
7. మట్ట సత్యవతి, W/o. భాస్కరరావు
8. మట్ట శ్రీనివాసరావు, S/o. భాస్కరరావు
9. మట్ట వీర వెంకట సత్యవేణి, W/o. భాస్కరరావు
10. మట్ట సాయికుమార్ యాదవ్, S/o. భాస్కరరావు
11. మట్ట సత్యవతి, W/o. ప్రకాశరావు
12. బెనబోయిన మకరజ్యోతి, W/o. వెంకట రమణ
13. మండిగండి హేమలత, W/o. లక్ష్మణుడు
14. మట్ట సంతోషి రూపాదేవి, D/o. ప్రకాశరావు

డో.నెం.44-12-5, పరదేశమ్మపేట, కాళే వారి వీధి, జగన్నాధపురం, కాకినాడ.

పై నెంబరు అమలులో CPC Or 21, R 34 నోటీసుపై మీ హాజరు నిమిత్తం వాయిదా ది. 27-6-2025. కాబట్టి మీకు ఏమైన ఆక్షేపణలు వున్న యెడల వాయిదా తేదీ అనగా **27-6-2025వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరయి తెలుపుకోవలెను.

వాయిదా : 27-6-2025

ఓరుగంటి సుధాకర్
కాకినాడ అడ్వకేట్, కాకినాడ
ది.02-6-25 సెల్:9441143021

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఇరగవరం మండలం, ఓగిడి గ్రామానికి చెందిన ముప్పిడి నాగరాజు తూర్పుగోదావరి జిల్లా, పెరవలి మండలం అన్నవరప్పాడు గ్రామంలో తన అన్నయ్య ఇంటి వద్ద నివాసం ఉంటూ పాస్‌పోర్ట్ నెం - **N7196039** తీసుకుని పెరవలి జిరాక్స్ నిమిత్తం వెళుతుండగా మార్గ మధ్యలో పడిపోయినది దొరికిన వారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

అడ్రస్:
ముప్పిడి నాగరాజు
S/o. ముప్పిడి ఆనందం
డో.నెం.-1-76, ఓగిడి గ్రామం
ఇరగవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా
ఫోన్ నెం: 7997814038

బహిరంగ ప్రకటన

నా క్లయింటు శ్రీమతి మూరా దేవమణి, W/o. నూకరాజు, ఇందిరాగాంధీ కాలనీ, ప్రత్తిపాడు గ్రామం, కాకినాడ జిల్లా మాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు ఇచ్చిన బహిరంగ ప్రకటన.

కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు మండలం, ప్రత్తిపాడు గ్రామం నందు సర్వే నెం. 345, బ్లాకు నెం. 8 నందు పాత డోర్ నెం. 8-82, క్రొత్త డోర్ నెం. 8-110 గల డాబా ఇల్లు, చర్చి, షాపు కలదు. నా క్లయింటు తల్లిగారైన పులగపూరి జయమణి, W/o. లేటు గంగరాజు గారు వ్రాయించిన వీలునామా ప్రకారం నా క్లయింటు సోదరీమణులు, సోదరులతో పాటు పై ఆస్తి యందు సమ వాటా నా క్లయింటుకు దకలు పడి సదరు ఆస్తి కుటుంబ సభ్యుల సమిష్టి హక్కు భుక్తములందున్నది.

కొందరు తప్పుడు పత్రములు సృష్టించి నా క్లయింటు ఆస్తిని అమ్ముటకు ప్రయత్నించుచున్నారు. నా క్లయింటు ప్రమేయము లేకుండా ఎవరైనను పై ఆస్తిపై ఎటువంటి లావాదేవీలు జరిపినను అవి చెల్లుబాటు కావు. అట్టి లావాదేవీలతో నా క్లయింటుకు ఎట్టి సంబంధము లేదని, చట్టపరంగా చెల్లనేరవని తెలియచేయడమైనది.

అర్తమూరి మోజెస్
రిటైర్డ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి మరియు అడ్వకేట్
పిఠాపురం, సెల్: 9492743097

మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 435/2023 in
O.S. No. 115/2019

Between:
ఆంధ్రాబ్యాంకు ప్రస్తుతం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, (రాయవరం బ్రాంచ్), రి॥ బై అసిస్టెంట్ జనరల్ మేనేజర్ *-పిటీషనర్/వాది*
AND
వక్కలంక వీర వెంకట సత్య సంతోష్ చిట్టి రామారావు మరియు వగైరా *-రెస్పాండెంట్లు/ ప్రతివాదులు*

To:
1వ రెస్పాండెంటు/ 1వ ప్రతివాది: వక్కలంక వీర వెంకట సత్య సంతోష్ చిట్టి రామారావు, తండ్రి: శేషగిరిరావు, వయస్సు 28 సం॥లు, డోర్ నెం. 5-77, సత్తెమ్మ వీధి, పందలపాక, బిక్కవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా.

2వ రెస్పాండెంటు/ 2వ ప్రతివాది: వక్కలంక శేషగిరిరావు, తండ్రి: వక్కలంక వీర వెంకట సత్య సంతోష్ చిట్టి రామారావు, వయస్సు 67 సం॥లు, డోర్ నెం. 5-77, సత్తెమ్మ వీధి, పందలపాక, బిక్కవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా.

పై నెంబరు పిటిషన్ గ్రంధంలో రెస్పాండెంట్లు/ ప్రతివాదులు అయిన మీకు మహారాజశ్రీ పై కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున మహారాజశ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం పైన తెలిపిన పిటిషన్ ది. **25-06-2025 సం॥నకు వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడుతుందని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

వి.వి.ఆర్.సుబ్రమణ్యం
అనపర్తి పిటిషనర్ తరపు అడ్వకేట్
ది.03-06-2025 అనపర్తి, సెల్:9912946959